క్లుప్తంగా

మండెం లక్ష్మీనారసింహుడికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం స్వామి వారికి అభిషేకం, కలశారాధన, విశ్వహోమం, అర్చన, నివేదన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం నిత్యహోమం జరిపారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

సేవలను విస్తృతం చేస్తాం



డిస్పెన్సర్ అందజేస్తున్న దాత వినోద్‌కుమార్

రాయచోటి అర్బన్ : దాతల సహకారంతో లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని క్లబ్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ అన్నారు. శనివారం తిరుపతికి చెందిన సెవెన్ హిల్స్ మెడికల్ స్టోర్ అధినేత వినోద్‌కుమార్ లయన్స్ క్లబ్ నిర్వహించే చలివేంద్రం కోసం రూ.9వేలు విలువచేసే వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, సభ్యులు వినోద్‌కుమార్, భానుప్రకాష్, సుజిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం

చిట్వేలి: తిమ్మాయిపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న దత్తగిరి నారాయణ తపోవనంలో భగవద్గీత పారాయణం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభించారు. తపోవన నిర్వాహకురాలు నాగేశ్వరమ్మ, పద్మావతమ్మ, సభ్యులు బుజ్జమ్మ, శంకరమ్మలు విచ్చేసిన గురువులకు, భక్తాదులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భగవద్గీత పారాయణం చేయడం ద్వారా మనశ్శాంతి కలుగుతుందని తెలిపారు. విచ్చేసిన వారికి అన్నదాన వితరణ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కును అందజేస్తున్న రూపానందరెడ్డి

ఓబులవారిపల్లె : అనంతరాజుపేట పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా గుడికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 1 లక్ష చెక్కును అధ్యక్షుడు ముక్కా రూపానందరెడ్డి గ్రామస్తులకు అందజేశారు. ఇందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాష్‌రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, సీనియర్ నాయకుడు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



రాజుకుంటలో గ్రామోత్సవం దృశ్యం

చిట్వేలి : మండల పరిధిలోని రాజుకుంటలో శనివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండుగలా నిర్వహించారు. గ్రామంలో ఉత్సవాలు చేయకూడదని పరిస్థితులు నెలకొనడంతో ఈ మహోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం వైభవంగా మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల మధ్య వసంతాలు పోసుకుంటూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

పెంచలకోన ఉత్సవాలతో ఆర్టీసీకి ఆదాయం

రాజంపేట : పెంచలకోన ఉత్సవాలతో ఆర్టీసీకి రూ.8.70 లక్షల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ రమణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లా పెంచలకోనలో జరిగిన పెనుశిల నృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు 20 బస్సు సర్వీసులు నడిపామన్నారు. అందరి సహకారంతో ఆర్టీసీ ఆదాయం కోసం కృషిచేయడం జరుగుతోందన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పీలేరు రూరల్ : తిరుపతి రోడ్డులోని నాయీ బ్రాహ్మణ కాలనీలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.50 వేలు విరాళం ప్రకటించారు. శనివారం సర్పంచ్ హబీబ్‌బాషా విరాళాన్ని స్థానికులకు అందజేశారు.

ప్రతి ఇంటికి వెళ్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ



రాయచోటి అర్బన్: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: విద్యార్థులకు నియామకపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : సంక్షేమ పథకాల అమలుతోనే పేదల అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన 33వ వార్డులోని ఇందిరమ్మకాలనీ, మున్సిపల్ వర్కర్స్ కాలనీలలో ఆయన ఉదయం 6 గంటలకే గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వీధులలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని వారికి వెంటనే వాటిని అందేలా చూడాలంటూ అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పరిపాలనను సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ప్రమాదంలో గాయపడిన నరసింహులును ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. పాత రాయచోటిలో స్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్, కౌన్సిలర్ జ్యోత్స్న, కమిషనర్ గంగాప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నేతలు హబీబ్‌ఖాన్, మహమ్మద్‌ఖాన్, అన్నయ్య, ఆంజనేయులు, వెంకటేష్, కొలిమి చాన్‌బాషా, గువ్వల బుజ్జిబాబు, కొత్తిమీర ప్రసాద్, సుగవాసి ఈశ్వర్, శ్యామ్, జానం రవీంద్ర, జమాల్, ఖాదర్‌వలి, కో–ఆప్షన్‌సభ్యుడు అయ్యవారురెడ్డి, జగదీష్, జావీద్, అమీర్ పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కృషి

పురపాలక పరిధిలో అవసరమైన ప్రతివీధిలో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పాతరాయచోటి తోటవీధిలో రూ.26 లక్షలతో పూర్తయిన సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణాలను ఆయన మున్సిపల్ చైర్మన్‌తో కలసి ప్రారంభించారు.

జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటుకు కృషి

రాయచోటి : జిల్లా కేంద్రంలో జేఎన్‌టీయూ టెక్నికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగిన కళాశాల వార్షికోత్సవం, ఉద్యోగ విజయోత్సవానికి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలో అప్పటి లక్కిరెడ్డిపల్లె ఎమ్మెల్యే మోహన్‌రెడ్డితో కలిసి తాను పాలిటెక్నిక్ కళాశాల మంజూరునకు విన్నవిస్తే వైఎస్ఆర్ సానుకూలంగా స్పందించి మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఈ కళాశాలలో 240 మంది విద్యార్థులు రెండు కోర్సులలో విద్యను అభ్యసిస్తుండటం అభినందనీయమన్నారు. పీజీ కేంద్ర ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి అయిందన్నారు. యూనివర్శిటీ మంజూరునకు కృషి చేస్తున్నామన్నారు. అత్యాధునిక ప్రమాణాలతో కూడిన సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించాలన్నదే జగన్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపికైన 23 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, ప్రిన్సిపల్ శివశంకర్, మదనపల్లె పార్టీ పరిశీలకుడు హబీబుల్లాఖాన్, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ కేంద్ర ప్రారంభంలో..

విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ కేంద్రం ప్రారంభంలో శ్రీకాంత్ రెడ్డి పాల్గొని, మాట్లాడారు. రాయచోటిలో స్కిల్ హబ్ ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు

రాజంపేట టౌన్ : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా పాఠశాలల్లోనే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈఓ వెంకటేష్ నాయక్ శనివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ బాధ్యతను హెచ్‌ఎంలు తీసుకోవాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఫలితాలపై ఎంఈఓ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని పాఠశాలల్లో ఫలితాలు చాలా అధ్వాన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మార్సీకి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

సిద్దవటం : ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీకి చేరుకున్నాయని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన వచ్చిన పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు అన్ని సబ్జెక్టులు వచ్చాయన్నారు. 9వ, 10వ తరగతులకు సంబంధించి సీబీఎస్సీ సిలబస్ కావడంతో పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఈమేరకు మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు జూన్ నెలలో పాఠ్య పుస్తకాలను సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

వీధి విక్రయదారుల రక్షణ చట్టాన్ని అమలుపరచాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : వీధి వ్యాపారులకు రక్షణ చట్టాన్ని వెంటనే అమలుపరచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ నేతలు వీధి వ్యాపారులను కలుస్తూ వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో వీధివ్యాపారుల జీవనోపాధి, రక్షణ, క్రమబద్ధీకరణ చట్టం ఏర్పడిందన్నారు. అయితే చట్టం అమలు పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. పైగా వారిని మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. మున్సిపల్ పరిధిలో వీధివిక్రయ వ్యాపారుల నుంచి వసూలు చేస్తున్న గేటును వెంటనే ఆపివేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు ఎస్.శ్రీనివాసులు, పుల్లయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయా పోస్టులకు ఆయా గ్రామాలకు కేటాయించిన పోస్టులకు స్థానికులై, 10వ తరగతి పాసై ఉండాలన్నారు. నాలుగు మండలాల్లో 3 వర్కర్లు, 10 ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగించాలన్నారు. వివరాలకు లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ అధికారిని సంప్రదించాలన్నారు.

350 క్వింటాళ్ల జీలుగలు మంజూరు



జీలుగ విత్తనాలను పరిశీలిస్తున్న రమేష్‌రెడ్డి

సిద్దవటం : పచ్చిరొట్ట ఎరువుల కోసం సిద్దవటం మండలానికి 350 క్వింటాళ్ల జీలుగలు, 15 క్వింటాలు జనుముల మంజూరయ్యాయని వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సిద్దవటం రైతు భరోసా కేంద్రంలో మంజూరైన జీలుగలు, జనుములను ఆయన పరిశీలించి, మాట్లాడారు. జీలుగలు, జనుముల విత్తనాలను ఈనెల 8వ తేదీన సోమవారం ఆయా రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు ఎవరి పేరు మీద భూమి ఉంటే వారే వెళ్లాలన్నారు. వెళ్లేటప్పుడు ఒరిజనల్ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకెళ్లాలన్నారు. ఎకరాకు ఒక బ్యాగు(10 కిలోలు) చొప్పున 5 ఎకరాలకు 5 బ్యాగులు 50 కిలోలు గరిష్ఠంగా ఇవ్వబడునన్నారు. జీలుగలు, జనుములు 50 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి తీసుకోవచ్చునని ఆయన అన్నారు.

సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి

వాల్మీకిపురం : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగా నారపరెడ్డి సుధాకర్ రెడ్డి ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాంస్కృతికం పట్ల ప్రత్యేక చొరవ చూపుతుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శివమణి, రాధ, ఎరికలప్ప, సూర్యనారాయణరాయల్, చెవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుట్టపల్లె ఆంజన్న తిరునాల



ప్రత్యేక అలంకరణలో గుట్టపల్లె వీరాంజనేయుడు

సంబేపల్లె : గుట్టపల్లె సమీపంలో కొలువైన వీరాంజనేయుడి తిరునాలను ఆలయ చైర్మన్ చిదంబర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో చలువపందిళ్లతో అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. పూజల్లో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

పద కవితా పితామహుడు అన్నమయ్య



అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ కో–ఆప్షన్ సభ్యుడు బండి బాబు

కడప కార్పొరేషన్ : ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమయ్య పద కవితా పితామహుడని మాజీ కో ఆప్షన్ సభ్యుడు బండిబాబు, బండారు సత్య అన్నారు. శనివారం అన్నమయ్య జయంతి సందర్భంగా మున్సిపల్ హైస్కూల్(మెయిన్) ఎదురుగా ఉన్న అన్నమయ్య విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలేశుని తొలి భక్తుడైన అన్నమయ్య రాసిన భక్తి గీతాలను ఎప్పటికీ మరువలేమన్నారు. వైష్ణవ సాంప్రదాయ దేవతలను కీర్తిస్తూ ఆయన 32వేలకు పైగా కీర్తనలు రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి. ఈశ్వరయ్య, ఎ. వెంకటేశ్వర్లు, జి. సుబ్బరాయుడు, ఎ. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులు



ఎస్‌జీ కళాశాల ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

పీలేరురూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు రాష్ట్ర కళాశాలల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శనివారం స్థానిక సంజయగాంధీ డిగ్రీ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులు, బాలికల వసతి గృహం, ఆటస్థలం, రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక డిగ్రీ కళాశాల స్వయంప్రతిపత్తి హోదా పొందడానికి అన్ని అర్హతలు కలిగి ఉందని తెలిపారు.

• 8, 9 తేదీల్లో గాలివీటమ్మ జాతర



గాలివీడు : మండల కేంద్రంలో వెలసిన గాలివీటమ్మ జాతర సోమ, మంగళవారాలలో జరుగనుందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం సిద్దలకూడు నైవేద్యంతో ప్రారంభమయ్యే జాతర రాత్రికి నిండు తిరునాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, కోలాటాలు, బాణసంచా పేలుళ్లతో ప్రజలను కనువిందు చేస్తాయన్నారు. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీ బండ్లను అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్ధలతో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. మంగళవారం కల్లి పాటు కార్యక్రమంతో జాతర ముగుస్తుంది.


• వైభవంగా రేణుకా యల్లమాంబ కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం వైభవోపేతంగా జరిగింది. తిరునాల సందర్భంగా శనివారం సాయంత్రం జగజ్జనని రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు కల్యాణ మహోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితులు ఆర్.మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

• కనుల పండువగా విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి ప్రతిమ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులోని ఈదలవంక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ఉబ్బ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శనివారం కనుల పండువగా సాగింది. ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, కళాహోమం, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వ్యాసముద్రం, బత్తాలపురం కుటుంబీకులు భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు.

• ఘనంగా రథోత్సవం

మదనపల్లి సిటీ: గోవిందనామస్మరణలతో రథోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవంపై స్వామిని ఆలయం నుంచి అప్పారావువీధి, మసీదువీధి,కమ్మవీధి, సంతబజారువీధి, రీడింగ్‌రూమువీధి, నెహ్రూనగర్‌లలో ఊరేగించారు. భక్తులు గోవిందనామాలు జపిస్తూ రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

వాల్మీకిపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని జర్రావారిపల్లి, అయ్యవారిపల్లి సచివాలయాలు, సంపద కేంద్రాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని, ప్రజలకు సత్వర సేవలు అందించాలన్నారు. అలాగే జర్రావారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులకు ప్రతి రోజు పాలు, గ్రుడ్డుతో పాటు భోజనం తీసుకునే విధంగా చూడాలన్నారు. అలాగే నిత్యం గర్భిణులు కాల్షియం, ఐరన్ మాత్రలు తీసుకునేలా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల పరిధిలో బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పొట్టిగా ఉన్న పిల్లలను ఖచ్చితంగా గుర్తించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ భారతి, ఈవోపీఆర్‌డీ శకుంతల, పంచాయతీ కార్యదర్శి అశ్విని, సర్పంచ్ ముని భాస్కర, నాయకులు ఆనంద, చంద్రశేఖర్, రవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లోనూ ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

రాయచోటి టౌన్ : పది పరీక్షల ఫలితాలలో రాయచోటి ఏపీ మోడల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. శనివారం 10వ తరగతి పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఫలితాలలో రాయచోటి ఏపీ మోడల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ రజనీ కృష్ణ తెలిపారు. మొత్తం 95 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 83 మంది ఉత్తీర్ణులు అయ్యారని చెప్పారు. ఉత్తీర్ణత శాతం 87.36 శాతం వచ్చినట్లు తెలిపారు. వీరిలో 500 మార్కులు కన్నా ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు 25 మంది ఉన్నారని తెలిపారు. 550 మార్కుల కన్నా ఎక్కువ సాధించిన విద్యార్థులు 5 మంది ఉన్నారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

రైల్వేకోడూరు రూరల్ : పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను మించి ఫలితాలను సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నందలూరు(రాజంపేట) : టెన్త్ ఫలితాల్లో నందలూరు మండల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ (ఆడపూరు) విద్యార్థులు 70 మంది విద్యార్థులకు గాను 56 మంది పాసయ్యారు.

రాజంపేట టౌన్ : టెన్త్ ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 50.52 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అమ్మాయిలు విశేష ప్రతిభ కనబరిచారు. ఉత్తీర్ణత శాతంలో కారంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల 93.33 శాతంతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, గుండ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 30 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది.

సిద్దవటం : మండలంలో 10వ తరగతి పరీక్షల్లో 249 మంది విద్యార్థులకు గాను 194మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 55 మంది ఫెయిలయ్యారు. పలువురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకున్నారు.

చిన్నమండెం : పదో తరగతి పరీక్షల ఫలితాలలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యార్థిని విశేష ప్రతిభ కనబరచినట్టు ఎంఈఓ శివానాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 8 ఉన్నత పాఠశాలలకు 359 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 278 మంది పాస్ అవ్వగా, 81 మంది ఫెయిల్ అయినట్లు ఆయన తెలియజేశారు.

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారని ఎంఈఓ రంగనాథయ్య, ప్రిన్సిపాల్ లీలా శ్రీహరిలు తెలియజేశారు. మండలంలోని ఉత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను వారు అభినందించారు.

ఓబులవారిపల్లె : ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పదోతరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారని ఎంఈఓ పద్మజ తెలిపారు. మండల వ్యాప్తంగా 629 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా 497 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 69.47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఒంటిమిట్ట : పదవ తరగతి ఫలితాల్లో ఒంటిమిట్ట మండల విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనభరిచారని ఎంఈఓ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 325 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 270 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

పెనగలూరు : పదోతరగతి పరీక్షా ఫలితాలలో పలువురు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. మండలంలో ఉత్తీర్ణతా శాతం గతం కంటే పెరిగింది. దీంతో ఎంఈఓ జయవేలు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

సంబేపల్లె : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండల వ్యాప్తంగా 80 శాతం ఉత్తీరత్ణ సాధించినట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. ఏప్రిల్ నెలలో జరిగిన పదవ తరతగతి పరీక్షలకు ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ, అంబేడ్కర్ గురుకులం, కేజీబీవీ పాఠశాలలకు సంబంధించి 420 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 337 మంది ఉత్తీర్ణ సాధించారు. పెద్దజంగంపల్లె ఎంపీపీ పాఠశాల, కేజీబీవీలలో 100 శాతం సాధించాయి.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న పీడీ శివయ్య

పీలేరురూరల్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ శివయ్య తెలిపారు. శనివారం మండలంలోని కంకరప్యాక్టరీ లేఅవుట్, ఏపీఐఐసీ లేవుట్లను పరిశీలించారు. మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 77,539 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు 19,633 ఇళ్లు పూర్తి అయ్యాయయని, 4192 మోల్డింగ్ వేశారని, 21,233 గుణాంతాల నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపారు. 938 ఇళ్లు ఇంకా ప్రారంభించలేదన్నారు. పీలేరు నియోజకవర్గంలో 12,030 మంజూరై వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాలు గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.